ప్రజాశక్తి
శుక్రవారం 17 నవంబర్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఓటరు జాబితాలపై దుమారం

ఫారం-7తో ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు - అడ్డుకునేందుకు టిడిపి, జనసేన పోరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పుల వ్యవహారంలో ప్రధాన రాజకీయపక్షాల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపుకోసం ఓటర్ల జాబితాలే కీలకం కావడంతో టిడిపి ప్రత్యేకంగా ఈ అంశంపై దృష్టి సారించింది. తాజాగా జనసేనతో కలిసి టిడిపి ప్రతి నియోజకవర్గంలో తమ పార్టీ సానుభూతి పరుల ఓట్ల తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫారం-7 ద్వారా తమపార్టీ ఓట్లను తొలగిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. గురువారం సాయంత్రం గుంటూరు కార్పొరేషన్‌లో అధికారులను టిడిపి,జనసేననాయకులు నిలదీశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వేర్వేరు ప్రాంతాల్లో 989 ఓట్ల తొలగింపునకు ఫారం -7లు వైసిపి నాయకులు దాఖలు చేశారని వారు ఆరోపించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, టిడిపి కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్ తదితరులు కార్పొరేషన్‌లో అధికారులకు తమ నిరసన తెలిపారు. వైసిపినాయకులు ఆ పార్టీ కార్యకర్తల చేత భారీగా ఫారం -7 దరఖాస్తులు దాఖలు చేశారు. ఒక వ్యక్తి దగ్గర నుండి 5 ఓట్ల వరకు మాత్రమే రద్దు దరఖాస్తులు చేయాల్సి ఉండగా ఒక్కో వ్యక్తి సుమారు 150 నుండి 200 దాక ఓట్ల రద్దుకి అప్లికేషన్లు సమర్పించారు. తప్పుడు సమాచారంతో అసలు ఓటర్లకు నోటీసులు జారీ చేయడంపై కూడా నగరంలోని వివిధ ప్రాంతాల్లో గందరగోళం నెలకొంది. ఎవరికి వారు తమ ఓటు ఉందో లేదో తెలుసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.



అధికారులకు మూకుమ్మడిగా ఓట్లు తొలగిస్తే తామున్యాయపోరాటానికి వెళ్తామని టిడిపి, జనసేన నాయకులు తెలిపారు. ఓటర్ల ముసాయిదా జాబితాపై స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా 4,5తేదీల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో అధికారులు నిమగ్నం అయ్యారు. ఓటు లేని వారు కొత్తగా ఫారం-6తోదరఖాస్తు చేయగా ఓట్ల తొలగింపునకు కొంతమంది ఫారం-7 కూడాపెద్ద సంఖ్యలో దాఖలు చేశారు. వీరిలో స్థానికంగా ఉండటం లేదని, పలువురు మృతి చెందారని, బోగస్ ఓటర్ల పేరుతో వైసిపి నాయకులు భారీగా దరఖాస్తులు అందిస్తున్నారని, తమ పార్టీ ఓట్లు తొలగిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. జిల్లాలో ఇప్పటికే 19 వేల డబల్ ఎంట్రీలు వచ్చినట్టు అధికారులు గుర్తించారు. ఎన్నికల సంఘం రూపొందించిన ప్రత్యేక సాఫ్టవేర్ ద్వారా డబల్ ఎంట్రీలను గుర్తించి వారికి నోటీసులు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే జిరో డోర్ నెంబరుపై పెద్ద సంఖ్యలోఓటర్లు ఉన్నారు. వీటిల్లో గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పులో ఒకే డోర్‌నెంబరుపై పెద్ద ఎత్తున ఓట్లు ఉన్నట్టు తెలిసింది. ఇదేసమయంలో జీరోనెంబరుతో కూడా భారీగా ఓట్లు ఉన్నాయి. ఒకే డోర్‌నెంబరుతో 10కి మించిఓట్లుఉండకూడదన్న నిబంధనను పాటించలేదు. కొత్తగా జిల్లా మొత్తం మీద 1,24,743 మంది ఓటుకోసం దరఖాస్తుచేశారు. అలాగే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు 32,064 మంది ఉన్నారు. వీరి దరఖాస్తులకు ఆధార్ చిరునామా మార్పు, గ్యాస్ బిల్లు, స్థానికంగా నివాసం ఉంటున్నట్టు నిర్ధారణ జరిగితే చిరునామా మార్పుతో ఓటును మారుస్తామని అధికారులు చెబుతున్నారు. సరైన చిరునామా సమర్పించక చాలామంది దరఖాస్తులు పెండింగ్‌లోఉంచారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

గతేడాది ఏప్రిల్‌లో గురజాలలో జరిగిన ఘటనపై కోర్టు తీర్పు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎక్కాల్సిన రైలు కాకుండా పొరుబాటున మరో రైలు ఎక్కి బాష తెలియక ఏం చేయాలో పాలుపోక గురజాల రైల్వే స్టేషన్‌లో దిగిన మహిళ లైంగిక దాడికి గురైంది. గతేడాది ఏప్రిల్ 15న జరిగిన ఈ ఘటన మరుసటి రోజు వెలుగులోకి రాగా తాజాగా ఈ కేసులో ఇద్దరికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గుంటూరు 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి కె.నీలిమ గురువారం తీర్పును వెలువరించారు. ఈ వేరకు వివరాలను నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి వెల్లడించారు.



దోషులుగా తేలిన ఇద్దరు దుండగులు (బేడీలతో ఉన్నవారు)

ఒక మహిళ తన మూడేళ్ల కొడుకుతో గతేడాది ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని అత్త ఇంటి వద్ద నుండి మధ్యప్రదేశ్‌లోని తన పుట్టింటికి వెళ్తూ దారి తప్పి వెళ్ళాల్సిన రైలు ఎక్కకుండా వేరొక రైలు ఎక్కి 15వ తేదీన రాత్రి గురజాల రైల్వే స్టేషన్‌లో దిగారు. అప్పటికే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న దుండగులైన కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన కంద్రకొండ సుబ్బారావు, గురజాలకు చెందిన మాదిరాజు ప్రసాద్ కలిసి ఆకలితో ఉన్న భాధిత మహిళకు ఆహారం ఆశ చూపి గురజాల ఇష్టకామేశ్వరి గుడి వెనుకకు తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారన్నారు. బాధిత మహిళ గురజాల రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై స్పృహతప్పి రక్తపు మడుగులో పడిపోయి ఉండడాన్ని గమనించిన రైల్వే పోలీసులు 16న గురజాలలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు బదిలీలు అయిన సందర్భంగా నరసరావుపేట దిశా డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు అమర్చడం వల్ల దుండగుల కదలికలు కనిపెట్టి వారిని అరెస్టు చేశారు. ఈ కేసులో 24 మంది సాక్షులను ప్రాసిక్యూషన్ వారు విచారణ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కె.వెంకట్‌రెడ్డి వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరచిన దిశా డీఎస్పీ రవిచంద్ర, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ టి.మాణిక్యాలరావు, పిపిలను ఎస్పీ అభినందించారు.

దీనిపై ఎస్పీ మాట్లాడుతూ ▶ 2లో



రూ.265 లీటర్ల బయో ఉత్పత్తులు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్లలో ఎరువులు, పురుగు మందుల దుకాణంలో విజిలెన్సు అధికారులు గురువారం తనిఖీలు చేశారు. ధనమల్లేశ్వర ఫెర్టిలైజర్సు దుకాణంలో పురుగు మందులు, బయో ఉత్పత్తుల నిల్వలకు అనుమతిలేదని గుర్తించి రూ.5.19 లక్షల విలువైన 265.8 లీటర్ల సరుకులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి కె.రమణకుమార్, ఎస్ఐ రామచంద్రయ్య పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ పిల్లల్ని బడిలో చేర్పించేందుకు చర్యలు

2 లో

ఉత్సాహంగా ముగిసిన బాలల చలనచిత్రోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

బాలల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి చలనచిత్రోత్సవాలు ఎంతగానో ఉపకరిస్తాయని ప్రముఖ సినీ గీత రచయిత, దర్శకుడు డాడీ శ్రీనివాస్ అన్నారు. తెనాలి కల్చరల్ ఫిలిమ్స్ సొసైటీ సహకారంతో చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ తెనాలి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలోని వివేకానందా సెంట్రల్ స్కూల్ ఆవరణలో మూడ్రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ బాలల చలనచిత్రం గురువారం ముగిశాయి. ముగింపు సభకు వివేకా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రాయపాటి వీరనారాయణరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాడీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాలు జరపాల్సిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలను తెనాలిలో ఏటా జరుగుతున్న సొసైటీని అభినందించారు. చిత్రోత్సవాలు ప్రతిభ కలిగిన వారికి ఒక వేదికగా ▶ 2లో



నిర్వాహకుల నుండి జ్ఞాపికలను అందుకుంటున్న బాల నటులు



గుంటూరు ఆటోనగర్‌లో అగ్నిప్రమాదం


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరం ఆటోనగర్‌లోని ప్లాస్టిక్ వస్తువులు తయారు చేసే కంపెనీలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. షార్టు సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలను కొనుగోలు చేసి నిల్వ చేసి పిల్లెట్స్ (ప్లాస్టిక్ బాల్స్) తయారు చేసే ఈ కంపెనీలో చాలా కాలంగా నిల్వలు పేరుకుపోయాయి. అగ్ని ప్రమాదంలో ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలు భారీగా దగ్ధమవడంతోపాటు కంపెనీ ముందు ఉన్న ఒక కారు కూడా కాలిపోయింది. పెద్ద ఎత్తున మంటలు లేచాయి. గాలి ఎక్కువగా ఉండటంతో కొద్దిసేపు మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. నష్టం దాదాపు రూ.4 లక్షల వరకు ఉంటుందని అంచనా. పెదకాకాని పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

17 నుండి బాస్కెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆంధ్రప్రదేశ్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ అంతర్ జిల్లాల స్త్రీ,పురుషుల బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోలలో సీనియర్ క్రీడాకారులు షుమారు 300 మంది పాల్గొంటారు. 50 మంది టెక్నికల్ అఫీషియల్స్ పోటీలను పర్యవేక్షిస్తారు.



కరచాలనం చేసుకుంటున్న రాజేంద్రప్రసాద్, మనోహర్

కలిసి పని చేసి వైసిపిని ఓడిద్దాం

టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్, నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణంలోని నాజరుపేట ఎన్‌విఆర్ కళ్యాణ మండపంలో టిడిపి, జనసేన పార్టీల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాలు కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టిడిపి చేపట్టిన భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో జనసైనికులు కూడా పాల్గొనాలని, టిడిపితో కలిసి పనిచేస్తున్న జనసైనికులకు తగిన గౌరవం ఉంటుందని అన్నారు. వార్డుల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తమ ప్రభుత్వం వచ్చాక ఇబ్బందులను తీరుస్తామన్న భరోసా ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గ అభ్యర్థి ఎవరన్నది ఇరుపార్టీల అధినాయకత్వమే నిర్ణయిస్తుందని చెప్పారు. మనోహర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఆలపాటి సారధ్యంలో చేసిన పోరాటాలన్నీ అభినందనీయమన్నారు. వైసిపి పాలనలో లెక్కలేనంత అవినీతి జరిగిందని, ఆధారాలతో సహా అవినీతి చిట్టాలు సిద్ధం చేశామని, వాటన్నింటిని ప్రజల ముందు ఉంచుతామని అన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - వినుకొండ

దుర్మార్గ వైసిపి ప్రభుత్వాన్ని తుది ముట్టించేంత వరకు టిడిపి, జనసేన శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో గల వై కన్వెన్షన్ హాలులో గురువారం నిర్వహించారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి నాయకులు ఓటమి భయంతో టిడిపి, జనసేన సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని, కార్యకర్తలు జాగ్రత్తలు పాటించి ఓట్ల తొలగింపుపై దృష్టి పెట్టాలని కోరారు. కష్టపడి పనిచేసిన ఇరు పార్టీల కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి శంకర్రావు శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న చిన్న పొరపాట్లను సరిదిద్దుకొని సమన్వయంతో అందరం కలిసి పని చేస్తామన్నారు. సమావేశంలో సమన్వయ కమిటీ కన్వీనర్ నాగశ్రీ, నాయకులు ఎల్.వెంకటరావు, షమీం ఖాన్ పాల్గొన్నారు.



ఐక్యతా అభివాదం చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

27, 28 తేదీల్లో అంగన్వాడీల మహాధర్నా

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను, డిసెంబర్ 8న జరిగే దేశవ్యాప్త ధర్నాను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి జి.మల్లీశ్వరి పిలుపునిచ్చారు. ఈ మేరకు పండరిపురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడాతూ అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వాలకు పట్టడం లేదని, శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రస్తావించిన సరైన సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. గ్రాడ్యుటీ అమలు చేయాలని, వివిధ వివరాల అప్‌లోడ్ కోసం నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని, మానసికంగా ఒత్తిళ్లకు గురువుతున్నారని అన్నారు. వీటితోపాటు అద్దె, కరెంటు బిల్లులు తదితర స్థానిక సమస్యల మీద స్థానిక అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ఈనెల 20న ధర్నాలు చేస్తామని చెప్పారు. రెండు మూడు నెలలుగా జీతాలు రాలేదని, అప్పులతో కుటుంబాలను పోషించుకోవాల్సి రావడం, సెంటర్లను నిర్వహించాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదువుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని జీవోలున్నా సిడిపిఒలు అమలు చేయడం లేదని, దీనిపై కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదని అన్నారు. వీటి పరిష్కారం కోసం చేసే పోరాటాల్లో అంగన్వాడీలంతా ఐక్యంగా పాల్గొనాలని కోరారు. అనంతరం రాష్ట్ర నాయకులు కెవిల్ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రాజెక్టు అధ్యక్షులు సావిత్రి, సిఐటియు మండల కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, ఎం.విల్సన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు కెవిల్ శ్రీనివాస్

వరికపూశెల పనులపై ప్రతినెలా సమీక్ష

ఓర్వలేక టిడిపి దుష్ప్రచారం : ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

వరికపూడిశెల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించడంతోపాటు పనులను ప్రతినెలా సమీక్షిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ శంకుస్థాపన సభలో లక్ష మంది రైతులు పాల్గొనడంతో టిడిపి జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలు చేస్తోందని విమర్శించారు. వైసిపి అధికారంలోకి రాగానే మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రిని 30 నుండి 50 పడకలకు పెంచామని, సుమారు రూ.100 కోట్లతో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలను 100 పడకల ఆసుపత్రిగా మారస్తామని సిఎం ప్రకటించారని చెప్పారు. పలు రహదార్లకు నిధులివ్వడానికి, పేటసన్నిగండ్లలో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తికి సిఎం అంగీకరించినట్లు తెలిపారు. పట్టణంలో తాగు నీటి పథకం పనులు త్వరలో జరుగుతాయన్నారు. సమావేశంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చినఏసోబు, శ్రీనివాసశర్మ, కె.సాయిమా ర్కోండారెడ్డి, టి.కిషోర్, బి.రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

కొండలు, గనులు తవ్వడం ఎమ్మెల్యే పని

టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికలకు ముందు టెంకాయి కొడితే అది ప్రజలను మోసం చేసేందుకే అన్న జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన మాటలు మర్చిపోయారేమో గుర్తు చేసుకోవాలని టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి నాలుగున్నరేళ్లుగా గుర్తుకు రాని నియోజకవర్గ సమస్యలు నిన్న అడగటం, ఆయన ఆలోచిస్తామనటం ప్రజలను మోసం చేయాటానికేనన్నారు. అనుమతులు లేకుండా కొండలు తవ్వటం, గనులు తవ్వటం మాచర్ల ఎమ్మెల్యే పని అని, ఎక్కడ వైసిపి ప్రభుత్వం మీటింగ్‌లు పెట్టినా స్కూల్స్, షాపులు మూతపడాల్సిందేనని విమర్శించారు. సిఎం సభలో మద్యం ఏరులై పారిందని, బల ప్రదర్శన కోసం చేసిన సభే కాని, ఇక్కడ రైతులకు ఉపయోగం లేదని అన్నారు. సమావేశంలో నాయకులు ఎం.దాసు, జి.సీతారెడ్డి, ఎం.రాంబాబు, కె.దుర్గారావు, నాగూర్ బాషా, బి.కృష్ణవేణి, బాలశౌరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి బ్రహ్మారెడ్డి

ఉత్సాహంగా ముగిసిన బాలల చలనచిత్రోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగపడుతున్నాయని చెప్పారు. బాలల చిత్రాలకు ప్రభుత్వాలు ప్రకటించిన సబ్సిడీని మొత్తాన్ని సకాలంలో జమ చేసినట్లయితే నిర్మాత దర్శకులు మరిన్ని మంచి చిత్రాలను తీసేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. తాను తీసిన బాలల చిత్రం 'మట్టిలో మాణిక్యాలు'కు ద్వితీయ ఉత్తమ బాలల చిత్రంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి అవార్డు పొందిందన్నారు. ఆ సినిమాకి ఉగాది ఎక్సలెన్స్ జాతీయస్థాయి అంబేద్కర్ అవార్డులు వచ్చాయన్నారు. ఇప్పటికీ తెలంగాణ ఏపీ ప్రభుత్వాలు ప్రకటించిన సబ్సిడీ జమ చేయలేదని తెలిపారు. ప్రతిభ కనబర్చిన కళాకారుడు ఎప్పటికైనా తన ప్రతిభను నిరూపించుకుంటాడని చెప్పేందుకు తానే నిదర్శనమని, అనేక కష్టాలను అనుభవిస్తూ సినీ రంగంలో పాటల రచయితగా నిలదొక్కుకొని ఇప్పటికీ 396 సినిమాల్లో 800 పైగా పాటలు రాశానని చెప్పారు. బింబిసారాలో నటించిన బాలనాటి శ్రీదేవి, భగవత్ కేసరి సినిమా బాల నటుడు పుష్కర్, టీవీ, సినిమా, వెబ్ సిరీస్‌లో నటిస్తున్న బాలనాటి భవ్యశ్రీ తదితరులు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరికి సర్టిఫికెట్లను జ్ఞాపకలను బహూకరించారు. వివిధ సినిమాల్లో వీరు నటించిన సన్నివేశాలను ప్రదర్శించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, వివేకానంద సెంట్రల్ స్కూల్ సిఇఒ రావిపాటి వెంకటరావు, ఏవో సత్య ప్రసాద్, చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి బొల్లిముంత కష్ణ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని, నరసరావుపేట, గురజాల, చిలకలూరిపేట, సత్తెనపల్లి మాచర్ల తదితర పట్టణాల్లో సిసి కెమెరాలు అమర్చామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సత్వరమే గుర్తిస్తామన్నారు. క్షణికావేశాలకు గురై జీవితాన్ని పాడుచేసుకోవద్దని, బాపట్ల జిల్లాలో ఇదే తరహాలో జరిగిన ఘటనలో కూడా ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష పడిందని చెప్పారు. అపరిత వ్యక్తులకు దూరంగా ఉండాలని మహిళలు, యువతులు, బాలికలకు సూచించారు. ప్రతి మహిళా దిశా యాప్ డౌన్లోడ్ చేసుకొని ఆపత్కాలంలో రక్షణ పొందాలని సూచించారు.

1.50 కోట్లతో జెట్టిపాలెం నుండి మల్లవరం రహదారికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని జెట్టిపాలెం నుంచి మల్లవరానికి మూడు కిలోమీటర్ల మేర నూతన రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్ గ్రామీణ రహదారి పథకం కింద రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నూతన వైస్ ఎంపిపిగా ఎన్నికైన సంపూర్ణమ్మను సత్కరించారు. మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంపిపి చౌడేశ్వరి, వైసిపి మండల కన్వీనర్ జి.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ పిల్లల్ని బడిలో చేర్పించేందుకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

డ్రాప్ అవుట్స్ అయిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించటంతోపాటు వారిని నిరంతరం పర్యవేక్షిస్తూ తిరిగి వారు డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో, మహిళా, శిశు సంక్షేమం, జగనన్న ఆరోగ్యసురక్ష, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం, జగనన్నకు చెబుదాం, సుస్థిర అభివద్ధి లక్ష్యాలు, అంగన్వాడీ సెంటర్లు, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ప్రభుత్వ ప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్‌రెడ్డి గురువారం సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ శ్రావణబాబు, సీపీఓ శేషశ్రీ, డీఈఓ శైలజ, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి, అడిషనల్ డియం అండ్ హెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, టూరిజం అధికారి నాయుడు పాల్గొన్నారు.

ఎకరాలకు రూ.3 లక్షల రుణం ఇచ్చే స్థాయికి సహకార సంఘాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వైసిపి పాలనలో సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని ధూళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివనారాయణ అన్నారు. అఖిల భారత సహకార దినోత్సవం సందర్భంగా ధూళిపాళ్ల ఎబిలో ఎఫ్ఎస్‌సిఎస్ సొసైటీ ఆవరణలో సహకార వారోత్సవాల సందర్భంగా జెండాను గురువారం ఆవిష్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సహకార సంఘ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, వైసిపి ప్రభుత్వంలో సహకార సంఘాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని అన్నారు. ఎకరానికి రూ.మూడు లక్షల వరకు వరకు రుణాలిచ్చే స్థాయికి సహకార సంఘము ఎదిగిందని చెప్పారు. సహకార సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు, కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ శివారెడ్డి, అధికారి టి.రజిని, సత్తెనపల్లి ఎస్‌డిఎల్‌సిఒ పరిమళ, ఎఆర్ ఎంవి నరసయ్య పాల్గొన్నారు.

మూడున్నర లక్షల తెలంగాణ మద్యం స్వాధీనం



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ కు అక్రమంగా తరలించిన తెలంగాణ మద్యాన్ని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు పట్టుకున్నట్లు నరసరావుపేట స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో సూపర్డెంట్ డిఎస్ దుర్గాప్రసాద్ తెలియజేశారు గురువారం పట్టణంలోని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ రాఘ వేంద్రరావు ఆదేశాల మేరకు పిడుగురాళ్ల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కొండారెడ్డి, గురజాల స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బందితో కలిసి మాచవరం మండలం గోవిందాపురం గ్రామంలో దాడులు నిర్వహించగా అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ కు అక్రమంగా తీసుకువచ్చిన 1384 తెలంగాణ మద్యం సీసాలను పట్టుకున్నామని ఈ దాడులలో నలుగురు వ్యక్తులు ఉండగా ముగ్గురు వ్యక్తులు పారిపోయారని మిగిలిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లాకు చెందిన చింతిర్యాల గ్రామస్తుడు తోడేటి గోపిగా గుర్తించామని తెలియజేశారు. నిందితుడు తోడేటి గోపిని విచారించగా పారిపోయిన వ్యక్తులు వివరాలు తెలియజేశారని ముగ్గురు ముద్దాయిల పేర్లు బడుగుల నాగరాజు,తోడేటి గోపి ఇరువురు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా చింతిర్యాల గ్రామానికి చెందిన వ్యక్తులని మూడో వ్యక్తి మాచవరం మండలం మొర్జంపాడు గ్రామానికి చెందిన యామిని రామకోటయ్యగా తెలిపినట్లు తెలియజేశారు.బడుగుల నాగరాజు తోడేటి గోపి ఇరువురు కలిసి తెలంగాణ రాష్ట్రంలోని సిరి వైన్స్ నుండి మద్యం కొనుగోలు చేసి తీసుకువచ్చేవారని తెలంగాణ రాష్ట్రానికి చెందిన చెడపొంగు సురేష్ అనే వ్యక్తి ద్వారా పడవలో ఆంధ్రప్రదేశ్ కు తీసుకువచ్చేవారని యామిని రామకోటయ్య ద్విచక్ర వాహనంపై అక్రమంగా తీసుకువచ్చిన మద్యం సీసాలను మరికొందరితో కలిసి అమ్మకాలు జరిపే వాడని తెలియజేశారు.

దాడిలో పట్టుబడ్డ తోడేటి గోపిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని మిగిలిన ముద్దాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అయిన తెలియజేశారు.ఈ దాడులలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పిడుగురాళ్ల గురజాల సిబ్బంది పాల్గొనట్లు ఆయన తెలియజేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల దష్ట్యా ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలో పటిష్ట నిగా ఏర్పాటు చేసినామని పట్టుబడిన మద్యం విలువ మూడున్నర లక్షల ఉంటుందని ఆయన తెలియజేశారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 29,055
మిర్చి ఎగుమతి	: 29,247
మిర్చి నిల్వ	: 9,102

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 24,000
నెం.5	16,000 - 20,000
273	11,000 - 19,000
341	11,000 - 20,500
సూపర్ 10	18,000 - 18,000
	నాన్ ఎసి
తేజ	9,000 - 24,000
బడిగి	8,000 - 23,500
దేవనూరు డీలక్స్	16,000 - 21,500
తాలుకాయలు	6,000 -14,000
	ఎసి
334	13,000 - 22,500
273	18,000 - 18,000
341	15,700 - 22,000
తేజ	12,500 - 23,900
బడిగి	15,000 - 25,000
తాలుకాయలు	7,000 -11,300

ఆస్తి విషయమై అన్నదమ్ముల వివాదం

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆస్తి విషయమై అన్నదమ్ముల వివాదం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఈ సం ఘటనకు చేబ్రోలు సబ్ ఇన్‌స్పెక్టర్ కె. ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం మండలలోని శేకూరు పాలెంకు చెందిన నెమలి కంటి కమలమ్మ పేరున 60 సెంట్లు భూమి ఉంది.. కమ లమ్మకు ఇద్దరు కుమారులు నెమలి కంటి ఆదాము, నెమలి కంటి వజ్రయ్య. పెద్ద కుమా రుడు ఆదాముకు మొదటి నుంచి ఉన్న అనారోగ్య కారణాల వల్ల తల్లి పేరిట ఉన్న 60 సెంట్లు భూమిని పంచాలని తమ్ముడు వజ్ర య్యను అడిగాడు. తల్లి బతికు ఉన్నంత వరకూ పంపకాలు చేయడం కుదరదని తమ్ముడు తేల్చి చెప్పాడు. ఒక రోజు తల్లి పొలంలో పనిచేస్తున్న సమయంలో ఆదాము,అతని భార్య సుకన్య తో కలిసి అమ్మపై గొడవ పడ్డారు. అక్కడికి వచ్చిన వజ్రయ్యను, ఆదాము అతని భార్య తో కలిసి కొట్టడంతో తన తల పగిలిందని వజ్రయ్య ఫిర్యాదు చేశాడు. రెండు నెలల క్రితం జరి గిన ఈ సం ఘట నకు సంబం ధించి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే, ఆదాము,. అతని భార్య ఈ మధ్య కాలంలో దిశా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన మరిది వజ్రయ్య, సుకన్యను లైంగికంగా వేధిస్తున్నాడనే ఫిర్యాదు మేరకు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆనంద్ తెలిపారు. సుకన్య తన భర్త బలహీనత అనా రోగ్య సమస్యలు కుటుంబ పరిస్థితులను గురించి ఆవేదన చెందుతూ తమ కుటుంబాన్ని ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి రక్షించాలని, ఆదాము ఆరోగ్య రీత్యా చాలా సమస్యలు ఉన్నాయని తెలిపింది. ప్రస్తుతము తమ మామ నెమలి కంటి భూషణం పేరిట ఉన్న పొలాన్ని తన భర్త ఆదాముకు కానీ, తనకు కానీ తెలియ కుండా తమ సంతకాలు ఫోర్జరీ చేసి తాము అంగీకరిస్తున్నట్లు ఆ పొలాన్ని కమలమ్మ పేరిట వజ్రయ్య మార్పించాడని, అధికారులతో కుమ్మక్కై ఇలా చేశారని ఆమె ఆరోపించారు. న్యాయబద్ధంగా తమకు రావాల్సిన ప్రకారం భూమి ఇవ్వకపోగా, పంపకాలు చేయమని అడిగితే తమ మరిది బెదిరిస్తు నాడని, శారీ రకంగా తన భర్తను, తనను హింసించాడని ఆరోపిచారు. లైంగికంగా , మానసికంగా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



నెమలి కంటి ఆదాము, సుకన్య

32 మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతం మందడం శివారు గ్రామం తాళ్లాయపాలెం లంకలో పేకాట స్థావరాలపై బుధవారం పోలీసులు దాడి చేశారు.32 మంది జూదరులను అరెస్ట్ చేశారు.వారివద్ద నుంచి రూ 4 లక్షల 35 వేల 500లు,31 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సిఐ ఆనందరావు తెలిపారు.

ఆలపాటి 'పెళ్ళికానుక'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన తలశిల శంకర్, లక్ష్మి దంపతుల కుమార్తె శశికళ వివాహం సందర్భంగా గురువారం ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపించిన పెళ్ళికానుకను టిడిపి కార్యకర్తలు అందించారు. చీర, సారె తో పాటు ఉంగరాన్ని బహుకరించారు. గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీను, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకటరావు, నలుకుర్తి విజయ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్ శ్రీరామ్ మెట్రిక్యులేషన్ ఉన్నత పాఠశాలలో ఉన్న బాలలకు మాదకద్రవ్యాలు వలన కలిగే శారీరక, మానసిక సమస్యలపై వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి రమేష్ మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమలత, ఉపాధ్యాయులు కె విజయ, బి సుజాత, జి దుర్గ, కె అంజమ్మ, బి.రత్నకుమారి, ప్రియాంక, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధన పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి: డిఇఒ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో టెక్స్ట్ బుక్కులు, నోట్స్‌లు, ఎస్ఎ 1 సిలబస్ పదో తరగతి అభ్యా సన తదితర అంశాలపై గురువారం అధికారులు పరిశీలించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన నిమిత్తం ఎంఇఒలు జాకబ్, సాల్మన్ పాఠశాలను సందర్శించి వివిధ అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి పాల్గొన్నారు.



వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి నుండి ఎన్నిక ధ్రువపత్రాన్ని అందుకుంటున్న సావిత్రి

కారంపూడి వైస్ ఎంపిపిగా సావిత్రి అల్లయ్య

ప్రజాశక్తి - కారంపూడి

కారంపూడి మండల పరిషత్ ఉపాధ్యక్షుని ఎన్నిక స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసఫ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. మండలంలో 14 ఎంపిటిసిలు ఉండగా బొమ్మెన సావిత్రి అల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతనెలలో గుండెబోయిన అమృతలక్ష్మి రాజీనామా చేయటంతో ఉపాధ్యక్షుని ఎన్నిక అనివార్యమైంది. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీనివాసరెడ్డి, ఎంపిపి ఎం.శారద శ్రీనివాసరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఎ.ఏసోబు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు కారంపూడి జెడ్‌పి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కారంపూడి

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గతనెలలో నరసరావుపేటలోని శంకర భారతిపురంలో సబ్ జూనియర్ ఖోఖో జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. ఇందులో భాగంగా కారంపూడి బ్రహ్మనాయుడు జెడ్‌పి పాఠశాలకు చెందిన బి.ర్యాన్‌పాల్, షాన్‌వాజ్, అక్షయ్ కుమార్, అర్షిత, అశ్విని ఉమ్మడి గుంటూరు జిల్లా జట్లకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనంత శివ గురువారం తెలిపారు. వీరు ఈనెల 26, 27, 28 తేదీల్లో నరసరావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, స్వర్ణ రాజు తెలిపారు.

గ్రంథాలాయాన్ని ఉపయోగించుకుంటే ఉన్నత శిఖరాలకు వెళ్లొచ్చు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పిడుగురాళ్ల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు హాజరయ్యారు. గ్రంథాలయం ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్ఆర్ రంగనాథులు, పాతూరు నాగభూషణం, వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయాలను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. గ్రంథాలయాధికారి కె.రాజశేఖర్, వెంకటేశ్వర్లు, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల హక్కులను హరిస్తే చర్యలు

ప్రజాశక్తి - నకరికల్లు



సదస్సులో మాట్లాడుతున్న కెజివి సరిత

ఎస్సీ, ఎస్టీలకు, రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎవరైనా కాలరాస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉమెన్ ప్రొడక్షన్ సెల్ అధికారి, సిఐడి ఎస్పీ కెజివి సరిత అన్నారు. మండల కేంద్రమైన నకరికల్లులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రక్షణ చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ ఉన్నతంగా, స్వేచ్ఛగా జీవించడానికి ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కొన్ని హక్కులు కల్పించిందని తెలిపారు. వారి మనోభావాలను, ప్రాథమిక హక్కుల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం ఉందని అన్నారు. ఎలాంటి వివక్షలూ లేకుండా అందరూ సమానంగా ఎదగాలని, విద్య ప్రాధాన్యతను గుర్తించి ప్రతిఒక్కరూ చదువుకోవాలని సూచించారు. ఆడపిల్ల ఆర్థిక స్వాతంత్ర్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో సిఐడి గుంటూరు డీఎస్పి వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, సిఐడి సీఐ సత్యనారాయణ, తేజోవతి, సత్తెనపల్లి రూరల్ సిఐ ప్రేమయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఝాన్సీ లక్ష్మి, తహశీల్దార్ నగేష్, ఎస్సైలు రాజేష్, బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



32 మంది విద్యార్థులకు నాసా కిట్లు

ప్రజాశక్తి - అమరావతి

విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యం పెంపొందించడానికి సైన్స్ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్సై మహబూబ్ సుభాని అన్నారు. శ్రీ చైతన్య స్కూల్‌లో చదువుతున్న 32 మంది విద్యార్థులు అమెరికాకు చెందిన నాసా సంస్థలో ప్రాజెక్ట్ చేయడానికి అవకాశం కల్పించగా వారికి నాసా కిట్‌లను ఎస్‌ఐ ద్వారా గురువారం అందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఎవిఆర్ రాజు, డీన్ రవికాంత్, ఇన్‌ఛార్జి ఇబ్రహీం, నాసా ఇన్‌ఛార్జి మానస పాల్గొన్నారు.

పల్నాడు ప్రజలకు సిఎం క్షమాపణ చెప్పాలి : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క రూపాయి నిధులు కేటాయించకుండా, క్యాబినెట్ అనుమతి లేకుండా, జీవో విడుదల చేయకుండా శంకుస్థాపన చేయటం అంటే పల్నాడు ప్రజలను మోసం చేయడమేనని, ఈ విషయంలో పల్నాడు ప్రజలకు సిఎం జగన్ క్షమాపణ చెప్పాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ.ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి హయాంలో ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.68 వేల కోట్లు ఖర్చు చేస్తే వైసిపి ప్రభుత్వం కేవలం రూ.32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. నారా చంద్రబాబు నాయుడు 23 సాగు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడమే కాక పోలవరం 73 శాతం పూర్తి చేశారని, వైసిపి ప్రభుత్వం 27 శాతమైనా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. టిడిపి హయాంలో 32 లక్షల ఎకరాల స్ర్తీకరణ చేసి ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాక గుండ్లకమ్మ నదిపై తొమ్మిది ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు కూడా చేయడం జరిగిందన్నారు. గోదావరి, పెన్నా నదుల అనుసంధానం, ఎన్ఎస్పి కుడికాలువకు గోదావరి నీళ్లు ఇచ్చే పథకాన్ని వైసిపి ప్రభుత్వం నిలిపేసిందని మండిపడ్డారు. పల్నాడు ప్రాంతంలోని 611 గ్రామాలకు శాశ్వత తాగునీరు సమస్య పరిష్కారానికి వాటర్ గ్రిడ్జ్ పథకం ద్వారా రూ.640 కోట్లు, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల మున్సిపాలిటీల్లో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.381 కోట్లు నిధులు తెచ్చి పైప్లైన్ ద్వారా ఇంటింటికి నీటి కొళాయి ఇచ్చే ప్రక్రియ టిడిపి ప్రభుత్వం చేపడితే అధికారంలోకి రాగానే వైసిపి ప్రభుత్వం రివర్స్ టెండర్ ప్రక్రియ ద్వారా అడ్డుకుందని అన్నారు. ప్రాజెక్టును దశలవారీగా పూర్తి చేస్తామంటూ బొల్లాపల్లి మండలాన్ని ఎత్తివేస్తే కనీసం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడకపోవడం అసమర్థత నిదర్శనమని వ్యాఖ్యానించారు. టిడిపి అధికారంలోకి రాగానే వరికపూడిశెల లక్ష ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రాజెక్టు పూర్తి చేయటంతో పాటు, గుండ్లకమ్మ నదిపై లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తి చేస్తామని చెప్పారు. వైసిపి పాలనలో బిల్లు రాక కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. సమావేశంలో ఎల్.వెంకటరావు, పి.నాగేశ్వరరావు, ఆర్.వీరంజనేయరెడ్డి, పి.కృష్ణ, ఎం.మురళికృష్ణ యాదవ్, బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న జివి : ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బస్సు యాత్ర తుస్సు యాత్ర అని జివి విమర్శించడం అతని అందత్వానికి నిదర్శనమన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర కంటే వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని, 30 నుండి 35 వేల మంది వస్తే కనపడలేదా? అని ప్రశ్నించారు. జీవి ఆంజనేయులు ఓటమి భయం పట్టుకొని అభద్రత భావం పెరిగి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా వినుకొండలో పూర్తి కాలేదంటే గత ఎమ్మెల్యే అసమర్థత కాదా అని ప్రశ్నించారు. తాగునీటి సమస్య పరిష్కారం, స్టేడియం, వంద పడకల ఆసుపత్రి, ఆస్పత్రుల భవన నిర్మాణాలు, సచివాలయాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో, రైతు భరోసా కేంద్రాలు, కాల్వకట్ట, రోడ్లు, ఆటోనగర్, లారీ స్టాండ్, కుంట అభివృద్ధి ఇలా అనేక కార్యక్రమాలు చేసి వినుకొండ పట్టణాన్ని అభివృద్ధి చేస్తుంటే కోర్టులో కేసులు వేయించి అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ప్రతిపక్షం చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజలకు గమనిస్తున్నారని, సరైన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

రెంటచింతల వైస్ ఎంపిపిగా సంపూర్ణమ్మ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - రెంటచింతల

మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా పాముల సంపూర్ణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గబ్రు నాయక్ వెల్లడించారు. ఈమెను పాలువాయి ఎంపిటిసి జి.ముక్కటేశ్వర్‌రెడ్డి ప్రతిపాదించగా తుమృకోట ఎంపిటిసి షేక్ జానీబాషా బలపరిచారు. కాగా జెట్టిపాలెం ఉపసర్పంచిగా దావులూరి నాగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, ఈ మేరకు ధ్రువపత్రం అందజేశామని ఎన్నికల అధికారి నరేంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.మహాలక్ష్మి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సాయిమార్కొండరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సొంటిరెడ్డి నర్సిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి ఎంపీపీ చౌడేశ్వరి పాల్గొన్నారు.

20న నరసరావుపేట, 22న సత్తెనపల్లిలో వైసిపి యాత్రలు

శ్రేణులతో మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సమావేశం



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

వైసిపి నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రను ఈనెల 22న సత్తెనపల్లిలో నిర్వహిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం తెలిపారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సమావేశానికి సిహెచ్ సాంబశివరావు అధ్యక్షత వహించగా మంత్రి మాట్లాడుతూ వైసిపి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అమలు చేసిన సంక్షేమ పథకాలపై బస్సుయాత్ర ద్వారా మరింతగా ప్రచారం చేయాలన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు ఒక్క ముస్లిముకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదని, చంద్రబాబు, పవన్ బీసీ ద్రోహులని విమర్శించారు. ఎన్‌టిఆర్ కంటే ఆయన అల్లుడు చంద్రబాబు పెద్ద నటుడని, లేనిపోని రోగాలు ఉన్నట్లు నటిస్తున్నారని ఎద్దేవ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వై.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పి.సూరిబాబు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 20న నరసరావుపేటలో ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని వైసిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావుశంలో ఆయన మాట్లాడుతూ బస్సు యాత్ర విజయవంతం చేసేందుకు ఇప్పటికే వైసిపి శ్రేణులతో సమాలోచన చేశామని, ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని విజయవంతం చేయాలని కోరారు. ఇతర నియోజకవర్గాల్లో చేపట్టిన యాత్రకు విశేష స్పందన లభించిందని, ఇదే క్రమంలో నరసరావుపేట మండలంలోని బసికాపురం వద్ద నుండి పట్టణంలోకి భారీ ర్యాలీ చేయాలని చెప్పారు. ఎస్.ఆర్.కె.టి కాలనీ వద్ద నుండి పల్నాడు బస్టాండ్ వరకు పాదయాత్ర చేస్తామన్నారు. అనంతరం ఏర్పాట్లపై పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలన చేపట్టారు. సభా ప్రాంగణం, భోజనాలు, పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు మున్సిపల్ హైస్కూల్‌లో, కార్లు ఎస్ఎస్ఎన్ కళాశాల ఎగ్జిబిషన్ ప్రాంగణంలో, భోజనం ఎస్.ఎస్.ఎన్ కళాశాల ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేశామన్నారు. యాత్రలో ఎంపీ విజయసాయిరెడ్డి సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక తరగతులకు చెందిన మంత్రులు, ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసరావుపేటలో ఏర్పాట్లపై పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పలువురు ప్రజాప్రతినిధులు ప్రమాణస్వీకారం


ధ్రువీకరణపత్రాన్ని అందిస్తున్న సబ్ కలెక్టర్

తెనాలి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తాడిబోయిన రాధిక

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మున్సిపల్ ఛైర్పెర్సన్‌గా తాడిబోయిన రాధికరమేష్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో నిర్వహించిన ప్రమాణస్వీకారం కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిధిగా పాల్గున్నారు. 12వ వార్డు మెంబర్ కొర్రా యశోద రామవత్ రాధికరమేష్ పేరును ప్రతిపాదించగా 33వ వార్డు మెంబర్ మొగల్ అహ్మద్ భేగ్ బలపరిచారు. 2వ అభ్యర్థి పేరును సభ్యులెవరూ ప్రతిపాదించికపోవడంతో ప్రిసైడింగ్ అధికారి తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు. వ్యక్తిగత కారణాలతో సయ్యద్ ఖాలేద నసీం తన ఛైర్పర్సన్ పదవికి అక్టోబర్ 12న రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తొలుత అట్టహాసంగా ప్రారంభమైన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి 8వ వార్డు వైసీపీ కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున పాల్గున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎం జస్వంతరావు, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గున్నారు.


నూతన ఎంపిపి చెన్నకేశవులును సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

చెన్నకేశవులుకే దక్కిన ఎంపిపి పీఠం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి కంచర్లపాలెం ఎంపిటిసి సభ్యులు ధర్మరాజుల చెన్నకేశవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రజాపరిషిత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి గా మండల పరిషత్ ఎన్నికల అధికారి వనజ ప్రమాణ స్వీకారం చేయించారు. అక్టోబర్ 5న గుడివాడకు చెందిన చెన్నుబోయిన శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి ఖాళీగా ఉన్న ఎంపిపి పదవి చెన్నకేశవులు(చెన్నయ్య) కు దక్కడంపట్ల పలువురు హర్షం వ్యక్తంచేశారు. తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ నూతన ఎంపిపి చెన్నకేశవులు కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఎంపిటిసి లు పిల్లి ఉమా ప్రణతి, మైలా బాను, వైసిపి నాయకులు పాల్గున్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ఇంటూరి పద్మావతి

గుంటూరు మండల అధ్యక్షురాలిగా పద్మావతి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు రూరల్ మండల ఎంపిపిగా తురకపాలెం ఎంపిటిసి ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి ఎన్నికలు నిర్వహించారు. ఎంపిపి పదవికి ఒక్క నామినేషన్ మాత్రమే వచ్చింది. దీంతో పద్మావతిని మండల అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అదికారులు ప్రకటించారు. అనంతరం నూతన ఎంపిపితో ప్రిసైడింగ్ అధికారి వజ్రశ్రీ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపిపి పదివి స్కీరించిన పద్మావతిని జెడ్పీటిసి తుమ్మల సుబ్బారావు, జీడీసిసి బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ,ఎంపిడిఒ ఎస్.ఆదినారాయణ, ఈఒపిఆర్‌డి శ్రీనివాసరావు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అబినందనలు తెలిపారు.

మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి రీజినల్ ప్రజా ఆరోగ్య వేదిక, వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ ఆధ్వర్యంలో 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు మంగళగిరి పెన్షనర్స్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్ గురువారం తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రస్తుత ఆరోగ్య బడ్జెట్ పైన, ఆరోగ్య ప్రాథమిక హక్కు, మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల.. అభివృద్ధిపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోనూ, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో చర్చ జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని సాయిప్రసాద్ కోరారు.

క్వాలిటీకి కేరాఫ్ బాబాయ్ అబ్బాయ్ ఫ్యామిలీ రెస్టారెంట్

ప్రజాశక్తి - మంగళగిరి

క్వాలిటీకి కేరాఫ్ బాబాయ్ అబ్బాయి ఫ్యామిలీ రెస్టారెంట్ అని రెస్టారెంట్ యజమాని బి రంగారావు మంగళగిరి పట్టణ పరిధిలోని ఆటోనగర్‌లో గౌతమ్ బుద్ధ రోడ్డు పక్కనే మూడు నెలల క్రితం నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆంధ్ర కోనసీమ టిఫిన్స్, ఇండియన్, చైనీస్, తందూరి, సౌత్ ఇండియన్ మీల్స్ రెస్టారెంట్లో ఉంటాయని తెలిపారు. అవుట్‌డోర్ క్యాటరింగ సౌకర్యం ఉందని తెలిపారు. ఆంధ్ర మీల్స్, రాగి సంగటి, అన్ని రకాల బిర్యానీలు, పుల్కా, రోటి, పీతల కూర, తలకాయ కూర, బోటి గోంగూర, నెల్లూరు చేపల పులుసు, బొమ్మిడాల పులుసు, మటన్ క్రిస్, బోన్ లెస్ చికెన్ క్రిస్ రకరకాల వంటకాలతో రెస్టారెంట్ భోజన ప్రియులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. క్వాలిటీతో తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. మంగళగిరి పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



13 రకాల సంగం ఉత్పత్తులు ఆవిష్కరణ : ధూళిపాళ్ల



ప్రజాశక్తి - చేబ్రోలు : 13 రకాల నూతన ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేశామని సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం సంగం డెయిరీ కార్యాలయంలో 13 రకాల ఉత్పత్తులను ధూళిపాళ్ల, పాలకవర్గసభ్యులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడారు. ఆట, బేసిన్, చేసాలడ్డులు 200 గ్రాములు ప్యాక్‌లను, ప్లెయిన్ కాజు, ఆరెంజ్ కాజు చాక్లెట్ కాజు 200 గ్రాముల ప్యాక్‌లను, బాదం రాకీ, పైనాపిల్ బార్ కేక్, కాజు స్టిక్స్, ప్లమ్ కేక్, గులాబ్‌జామ్, తదితర బేకరీ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నామని , అందరికీ అందుబాటు ధరల్లో విక్రయిస్తామని తెలిపారు. డెయిరీ పాల పదార్థాలను కంపెనీ వివిధ దశలలో 114 రకాల పరీక్షలు నిర్వహిస్తుందని చెప్పారు. సాంకేతికంగా అధునాతన ప్లాంట్లలో, అత్యాధునిక టెక్నాలజీతో యాంత్రీకరణ ద్వారా ఆటోమేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. 8 వేలకు పైగా డిస్ట్రిబ్యూటర్లు మరియు ఏజెంట్ల ద్వారా 82 రకాల పాలు మరియు పాల ఉత్పత్తులను లక్షలాది గహాలకు సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాపితంగా 6720 గ్రామాల్లో విస్తరించి లక్షా 50వేల మంది పాడి రైతుల నుండి 7,80వేల లీటర్ల పాలను సంగం డెయిరీ సేకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు డిస్ట్రిబ్యూటర్లు, ఏజంట్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసేందుకు పొత్తు

టిడిపి, జనసేన సమన్వయ భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం వల్ల అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయని టిడిపి, జనసేననాయకులు చెప్పారు. టిడిపి, జనసేన తూర్పు నియోజకవర్గం సమన్వయకమిటీ సమావేశం గురువారం పాత గుంటూరులో జరిగింది. టిడిపి నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇరు పార్టీలు కలిసి ప్రజల్లోకి వెళ్లే విధంగా భవిష్యత్ కార్యాచరణను ఏర్పాటు చేసేందుకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తూర్పు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నసీర్ మాట్లాడుతూ

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి టిడిపి జనసేన పార్టీలు కలిసి పనిచేయబోతున్నాయన్నారు. జనసేన నాయకులు నేరెళ్ల సురేష్ మాట్లాడుతూ జనసేన టిడిపి పార్టీలు రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలపై పోరాటంలో ప్రజాస్వామ్య రక్షణకు కలిసి పని చేయబోతున్నాయని గుంటూరు తూర్పులో టిడిపి జనసేన కార్యకర్తలు అందరం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజా క్షేత్రంలో ప్రజలకు తెలియజేస్తామని తెలియజేశారు. టిడిపి నాయకులు దాసరి రాజా మాస్టర్, చిట్టబత్తిన శ్రీనివాసరావు, జాగర్లమూడి శీను, టిడిపి నాయకులు యర్రగొపు నాగేశ్వరావు, యాల్లావుల అశోక్, బత్తిన శంకర్, వేములకొండ శ్రీనివాసరావు, శ్రీను నాయక్, గుడిపల్లి వాణి , విజయలక్ష్మి, జమీర్, మహంకాళి నరసింహ రావు , జనసేన నగర అధ్యక్షులు నేరేళ్ల సురేష్, మార్కండేయులు, నాగవల్లి, రోశయ్య,కిషోర్ కుమార్, నాగమల్లేశ్వరరావు, రేణుక రాజ్, ఆళ్లనాని, హరిసుందర్,ఆకుల ప్రసాద్,నరేష్, దుర్గాప్రసాద్, కుమార్ పాల్గొన్నారు



ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024కు సంబంధించి అందించిన క్లెయిమ్‌లు పెండింగ్ లేకుండా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో బీఎల్వోలతో సక్రమంగా విచారించి ఈ-రోల్‌లో అప్డేట్ అయ్యేలా ఏఈఆర్వోలు, ఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించి 30 రోజులుకుపైన అందించిన అన్ని రకాల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండటానికి వీలులేదని రెండు రోజుల్లో ఖచ్చితంగా పరిష్కరించి ఆన్లైన్‌లో అప్‌లోడ్ స్పష్టం చేశారు. సమావేశంలో ఏఈ ఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ. రవీంద్రరావు, లక్ష్మీ కుమారి, నగర అదనపు కమీషనర్ కే.లక్ష్మీ శివజ్యోతి , ఆర్డీఓ పి. శ్రీఖర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల్లో అక్రమాలను అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఓటర్ల జాబితాల్లో అక్రమాలను నిరోధించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురు వారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వినతిపత్రం సమర్పించారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ జాయింట్ సెక్రెటరీ వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి ,విజయవాడ మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్ ,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రా ర్ ప్రొఫెసర్ ఎన్ .రంగయ్య కలిసి రాష్ట్రంలో ఓటర్ల జాబితా సక్రమంగా రూపొందించాలని కోరారు. ప్రస్తుతం వాలంటీర్లు ,వార్డు సచివాలయ సిబ్బంది ల నేతత్వంలో ఓటరు జాబితా రూపొంది స్తున్నారని వీరిలో అత్యధికలు అధికార పార్టీ కార్యక్రమాలలో ప్రభుత్వ కార్యక్రమాలలో కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. ఫారం-7 ద్వారా ఓటర్ల తొలగింపులో అక్రమాలు జరుగుతున్నా యన్నారు. ఈ విషయమై సిటిజెన్స్ ఫర్ డెమొక్రసీ ఇప్పటికే సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశామన్నారు. మరో వైపు కేంద్ర ఎన్నికల సంఘంకు ఫిర్యాదు చేశామన్నారు. చీఫ్ ఎలెక్ట్రోల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా స్పందిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా ఒక లెటర్ రాసిందని వారికి త్వరలో సమాధానం తెలియజేస్తామని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.




చేనేత కార్మికులకు 15శాతం మజూరీ పెంపుదల

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి నగరంలోని మాస్టర్ వివర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళగిరి చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం , ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో చేనేత కార్మికుల నేత మజూరి 15శాతం పెంపుదల చేయాలని నిర్ణయించారు. పెంపుదల నవంబర్ 20వ తేదీ నుండి 2025 నవంబర్ వరకు అమలులో ఉంటుందని కమిటీ నిర్ణయించింది. మజూరి సర్క్యాలర్లో లేని ఇతర రకములను కూడా ఈ పెంపుదల అమలు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ నాయకులు జొన్నాదుల వరప్రసాద్, రావెల శివ సత్యనారాయణ, చేనేత కార్మిక సంఘం సమన్వయ కమిటీ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ, రామనాథం పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, కూరపాటి కోటేశ్వరరావు, డోకుపర్తి రామారావు, బత్తూరి మోహనరావు, కౌతవరపు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



జిల్లా కేంద్రం తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు జరిగిన ఏపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలలో తమ కళాశాల ఇంటెన్సివ్ క్యాంపస్ జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థి 100 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్ లో బంగారు పతకం, 50 మీటర్ల బటర్ ఫ్లై లో రజిత పతకం, 200 మీటర్ల ఇండిజువల్ మెడ్లే ఈవెంట్ లో కాంస్య పథకం సాధించడంతో పాటు వచ్చే నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయ స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ లో పాల్గొన్నట్లు ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. మధు కిషోర్ ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, ఇంటర్మీడియట్ ఇంటెన్షియల్ క్యాంపస్ ఇంచార్జ్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ యక్కల మధుసూదన్ రావు అభినందించారు.



హైస్కూల్‌లో మానిటరిగ్ అధికారి తనిఖీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు హైస్కూల్ ను మానిటరింగ్ ఆఫీసర్ ఎ.రాఘవేంద్రరావు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్ కరెక్షన్, క్వేషన్ పేపర్లు, నోటుబుక్స్, ప్యానల్ బోర్డులను, బంగారు తల్లి పథకం, మధ్యాహ్న భోజనం మరియు అకడమిక్ అంశాలను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాస రెడ్డి,పిసి చైర్మన్ జీ. శ్రీనివాస రెడ్డి,సిఆర్పి శివ పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

ప్రజాశక్తి,రాజుపాలెం

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రాజుపాలెం మండలం కేంద్రంలోని జడ్పీహెచ్ స్కూల్ లో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళిత బహుజన రిసోర్సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ గడ్డిపతి కోటిరత్నం అధ్యక్షత వహించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని అన్నారు. స్కూల్ హెచ్ఎం శైలజ మాట్లాడారు.

ఎన్నారైల సహకారంతో విద్యా సామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి -నాదెండ్ల

తల్లిదండ్రులు పంచి ఇచ్చే ఆస్తికన్నా విద్యయే గొప్ప ఆస్తిగా విద్యార్థులు గుర్తించినప్పుడే వారి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని కనపర్రు ఎంపీపీ ఎస్ పాఠశాల హెచ్ఎం వై రాజ్యలక్ష్మి చెప్పారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలోని బిపిఆర్ ఎంపీపీ స్కూల్ నందు గురువారం ఎన్నారైల సహకారంతో విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తన అన్న కుమార్తె ఉష శ్రీకాంత్ రెడ్డి దంపతులు ప్యారిస్ లో సాఫ్ట్వేర్ రంగంలో స్థిరపడ్డారన్నారు వారి ఆర్థిక సహాయం రూ 10 వేలతో పాఠశాలలోని విద్యార్థులకు పలకలు వాటర్ బాటిల్స్ ఇతర విద్య సామాగ్రిని అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ డి శైలజ కే యశోద బ్రహ్మయ్య పేరారెడ్డి వెంకటేశ్వర రెడ్డి రమాదేవి పీఎం కమిటీ చైర్మన్ హరిబాబు విద్యార్థులు పాల్గొన్నారు

నిమోనియాను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిమోనియా వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని తప్పనిసరిగా వైద్యుని సలహా మేరకు చికిత్స పొందాలని డిఎం %డ%హెచ్ ఓ డాక్టర్ బి.రవి అన్నారు. స్థానిక పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం నిమోనియో పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలోని బాలింతల వార్డులో చిన్నపిల్లల్లో వచ్చే శ్వాసకోశ వ్యాధుల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నపిల్లల వచ్చే నిమోనియో లక్షణాల గురించి, తీసుకోవలసిన చర్యల గురించి అదేవిధంగా చిన్నపిల్లలు పాలు త్రాగలేకపోవడం శ్వాస తీసుకోవటం కష్టంగా ఉండటం, గురక లక్షణం, మూర్చలో ఉన్నప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించి పిల్లలలో సకాలంలో వైద్యం అందించాలన్నారు. చలికాలంలో పిల్లలకు వెచ్చదనం కల్పించాలన్నారు. చంటి బిడ్డలకు తల్లి పాలు ఇవ్వడం వలన చంటి బిడ్డలలో రోగ నిరోధక శక్తి



అవగాహన కల్పిస్తున్న డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ బి.రవి

పెరుగుతుందన్నారు. నిమోనియా నివారణకు అవగాహన కార్యక్రమాలను ఈనెల 12 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 29 వరకు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ బి గీతాంజలి, ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ నాగ పద్మజ, డాక్టర్ అనిల్ చిన్నపిల్లల వైద్యులు, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, ఏరియా ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-ఈపూరు

సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చైర్ పర్సన్ బొల్లా వెంకట రాధాకష్ణ అన్నారు.మండల కేంద్రమైన ఈపూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద 76వ సహకార సంఘ వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జండా ఆవిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రైతుల అభివద్ధిని ఆకాంక్షిస్తూ పంచవర్ష ప్రణాళికలో భాగంగా సహకార సంఘాలను స్థాపించారన్నారు. ఈపూరు సహకార సంఘం ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు,పురుగు మందులు, విత్తనాలను అందజేస్తున్నామన్నారు. మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తున్నామన్నారు. సహకార సంఘం



ప్రతిజ్ఞ చేస్తున్న సహకార సంఘ చైర్మన్,సిబ్బంది

ద్వారానే మండలంలోని కొండ్రముట్ల వద్ద హెచ్ పి కంపెనీ పెట్రోల్ బంక్, ఈపూరు లో వే బ్రిడ్జి ఏర్పాటు చేశామని అన్నారు. మండల కేంద్రం ఈపూరులో జనరిక్ మందుల షాపు, కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపట్టబోతున్నామని అన్నారు. కార్యక్రమంలో వినుకొండ సబ్ డివిజన్ అధికారి పి వెంకటేశ్వర్లు, మండల ఇన్చార్జి కె రవి, సొసైటీ సెక్రటరీ పోకా కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు

ప్రజాశక్తి-క్రోసూరు

పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి ఆదేశాల మేరకు క్రోసూరు పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ బాల అంకమ్మ బాయి,డాక్టర్ మహమ్మద్ షాద్, డాక్టర్ సిరి చందన వారి ఆధ్వర్యంలో క్రోసూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థిని, విద్యార్థులకు దంత ఫ్లోరోసిస్ పరీక్షలు విస్తతంగా నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాంసన్ పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధి అంటే ఏమిటి? ఇది ఎన్ని రకాలు? ఫ్లోరోసిస్ యొక్క లక్షణాలు, ఫ్లోరోసిస్ నివారణ మార్గాలకు గూర్చి ప్రజలకు విద్యార్థులకు వివరించారు జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ మరియు నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శాంసన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో ప్రతి వందమందిలో ముగ్గురు ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్నారు అన్నారు స్వచ్ఛమైన నీరు, జీవన శైలిలో మార్పులు, సమతుల ఆహారం ద్వారా ఫ్లోరోసిస్ ని నివారించవచ్చునని ఆయన పేర్కొన్నారు ఫ్లోరోసిస్ రెండు రూపాల్లో వస్తుందన్నారు వీటిలో మొదటిది డెంటల్ ఫ్లోరోసిస్ ఇది ప్రధానంగా పిల్లలను ప్రభావితం చేస్తుంది ఇందులో ఆరేళ్లలోపు పిల్లల దంతాలు పసుపు రంగులోకి మారటం ప్రారంభమవుతుందన్నారు రెండవది స్కెలిటన్ ఫ్లోరోసిస్ ఇది శరీరంలోని కీళ్ళను ప్రభావితం చేస్తుందన్నారు ఇందులో మెడ, వీపు, భుజాలు, మోకాలు బలహీనంగా మారి వాటిల్లో ఎప్పుడూ నొప్పి ఉంటుందన్నారు దంతాలు పసుపు గా మారటం మోకాళ్ళ చుట్టూ వాపు కీళ్లనొప్పి ఫ్లోరోసిస్ యొక్క లక్షణాలని ఆయన అన్నారు చిన్నపిల్లలకు తక్కువ ఫ్లోరైడ్ ఉన్న టూత్ పేస్ట్ ఉపయోగించాలని, పిల్లలు పేస్టు మ్రింగ కుండా చూడాలన్నారు ఫ్లోరోసిస్ నివారణ మార్గాలు గూర్చి ఆయన వివరించారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - వినుకొండ

కార్తీక మాసం సందర్భంగా శివ భక్తులకొరకు ఆర్టీసీ పంచారామాలకు, త్రీశైవ క్షేత్రాలకు, మరియి శబరిమల స్వాములకొరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందని, ఈ నెల 19,26 మరియు డిసెంబర్ 3,10 తేదీ లలో పంచారామలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి లకు, ఆయా తేదీ లలో రాత్రి 10గంటలకు బస్సులు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పంచారామాలు దర్శించు కొని అదేరోజు సాయంత్రంనకు తిరిగి చేరుకుంటాయని, అలాగే ఒకేరోజులో శ్రీశైలం, మహానంది, యాగంటి త్రిశైవాక్షేత్ర దర్శనం చేసుకోవచ్చని డిపో మేనేజర్ బి. కోటేశ్వరరావు నాయక్ పేర్కొన్నారు. అలాగే ప్రఖ్యత పుణ్యక్షేత్రమైన అరుణాచలం నకు ప్రతి నెల పౌర్ణమి రోజున ప్రత్యేక బస్సులు నడుపబడుచున్నవి. పంచారామాలకు అల్ట్రా డీలక్స్ రూ.1450.ఒక్కొక్కరికి, అరుణాచలం ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీ రూ.2550/ గా టిక్కెట్ ధర నిర్ణయించినట్లు చెప్పారు. అయ్యప్ప స్వాములకు తక్కువ ధరలలో స్పెషల్ ప్యాకేజీ బస్సులు కలవని వివరాలకు ట్రాఫిక్ ఇంచార్జిని 7382896046, డిపో మేనేజర్ 9959225431 నంబరు లో సంప్రదించాల్సిందిగా కోరారు.



ఉపసర్పంచ్‌లు ఏకగ్రీవం

ప్రజాశక్తి-నాదెండ్ల

నాదెండ్ల,ఈ ర్లపాడు గ్రామాల ఉప సర్పంచులు ఏకీగ్రీవంగా ఎన్నికయ్యారు నాదెండ్ల గ్రామానికి టిడిపి అభ్యర్థి పాటిబండ్ల రామారావు ఎన్నికగా ఈర్లపాడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు పూర్ణ పెద్ద అంజయ్య ఎన్నికయ్యారు ఎన్నికైన నియామక పత్రాన్ని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ అందజేశారు కార్యక్రమంలో ఎంఈఓ ఐ ఆంజనేయులు గ్రామ సర్పంచి మంగు రమాదేవి వైఎస్ఆర్సిపి నాయకులు మంగు ఏడుకొండలు సెక్రటరీ పాల్గొన్నారు



ఉప సర్పంచ్ గా ప్రమాణం చేస్తున్న నాగాంజనేయులు

ప్రజాశక్తి -నకరికల్లు

చీమలమర్రి ఉప సర్పంచ్ గా చిమట నాగాంజనేయులు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈఓపిఆర్డి గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగాఈ ఓ పి ఆర్ డి మాట్లాడుతూ గతంలో ఉప సర్పంచ్ గా పనిచేసిన ముప్పాళ్ళ శివకుమారి గత రెండు నెలల క్రితం అనారోగ్య కారణాలతో పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ప్రకారం ఉప సర్పంచ్ పదవి ఖా ళీ గా ఉండడంతో గురువారం ఎన్నిక నిర్వహించగా నాగాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈవోపీఆర్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శై లేంద్రకుమార్, సర్పంచ్, బి ఉపేంద్ర ,వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



సకల కళాకారుల సమావేశం

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక వెల్లెటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో సకల కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా విశ్రాంత ఉపాధ్యాయులు అప్పరాజు నాగేశ్వరావు వ్యవహరించగా ముఖ్య అతిథులుగా రంగస్థలం కళాకారులు రామాపురం వెంకటేశ్వర్లు ప్రముఖ చిత్రకారులు వజ్రగిరి జస్టిస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో సకల కళాకారుల కార్తీక వన సమారాధన గత 7 సంవత్సరాలుగా గుమ్మడి నిర్వహిస్తున్నారని ఈ సంవత్సరం కూడా జరపడం సంతోషంగా ఉందని రాష్ట్రంలో ఎక్కడా కళాకారుల కార్తీక వన సమారాధన జరిగిన దాఖలాలు లేవని అది గుమ్మడి కళాపీఠం వారికే దక్కుతుందని కొనియాడారు. 3/12/2023 ఆదివారం వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వద్ధాశ్రమంలో సకల కళాకారుల కార్తీక వన సమారాధన జరుగుతుందని అన్నారు.

22న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవి రంగనాయకులు గురువారం తెలిపారు. మండల ప్రజాపరిషత్ ప్రాదేశిక సభ్యులు,గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శుక్రవారం 17 నవంబర్ 2023

పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపండి

రాజధాని సిఐటియు డివిజన్ కమిటీ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలోని పారిశుధ్య కార్మికులపై వేధింపులకు స్వస్తి పలకాలని సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది.బుధవారం రాజధాని ప్రాంతం తుళ్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు రాజధాని డివిజన్ కమిటి అధ్యక్ష,కార్యదర్శులు ఎం రవి,ఎం భాగ్యరాజు మాట్లాడుతూ , కార్మికులను తమ గ్రామాలలో పనిచేయ నీయకుండా, దూర గ్రామాలకు పంపించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న శాని టేషన్ కోఆర్డినేటర్ నరసింహారావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికులను నరసింహారావు దుర్భాష లాడుతున్నాడని ,ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసు కోలేదని మండిపడ్డారు. ఇది కాకపోతే నాకు పది ఉద్యోగాలు ఉన్నాయని కార్మికులను బెదిరిస్తున్నాడని చెప్పారు. నరసింహారావు పై గతంలో పలుమార్లు కార్మికులు, కార్మిక సంఘం నాయకులు సిఆర్డిఏ కమిషనర్ కు ఫిర్యాదు చేశారన్న ఉక్రోషంతో కార్మికులను నరసింహారావు దుర్భాషలాడుతున్నాడని అన్నారు. రాజధాని లోని గ్రామ గ్రామాన నరసింహారావు,కొంతమంది సూపర్ వైజర్ల బాధిత కార్మికులు వేధింపులు తట్టుకోలేక పారిశుధ్య పనులు మానేసి వేరే పనులకు వెళుతున్నారని చెప్పారు. నెక్కల్లులో కొండమ్మ, రామాంజనేయులు,తుళ్లూరులో సత్యవతి, మల్కాపురంలో సుజాత. మరికొందరు కార్మికులు విధులు మానేశారని చెప్పారు.గతంలో సీఆర్డీఏ పరిధిలో 425 మంది కార్మికులు పారిశుధ్య విధులు నిర్వహించగా,ప్రస్తుతం తుళ్లూరు మండలంలో 157 మంది పారిశుధ్య కార్మికులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ కార్మికులు ఎక్కువయ్యారు అనే పేరుతో గ్రామానికి నలుగురిని తొలగిస్తాం, ఇద్దరిని తొలగిస్తామంటూ కోఆర్డినేటర్ బెదిరిస్తున్నాడని అన్నారు. తమకు సంబంధంలేని మంగళగిరి - తాడేపల్లి మున్సిపాలి టీలో విలీనమైన మున్సిపల్ కార్మికులను కూడా నరసింహారావు బెదిరిస్తున్నాడని అన్నారు. నరసింహారావుతో కలిసి వెళ్లి మున్సిపల్ కార్మికులను మల్కాపురం సూపర్వైజర్ లత బెదిరింపులకు దిగారని చెప్పారు. ఎర్రబాలెంలో తన ఇంటిలో అంట్లు తోమేందుకు,బట్టలు ఉతకడానికి పారిశుధ్య కార్మికులను సూపర్వైజర్ లత వినియోగించుకుంటున్నారని,ఇటీవల తన ఇంటి వద్ద బస్తాలలో పూలు తెప్పించి ఎర్రబాలెం పారిశుధ్య కార్మికుల చేత పూలను వలిపించారని అన్నారు.కార్మికులు తనను లెక్కచేయడం లేదని,తిరిగి తను ఎర్రబాలెం సూపర్వైజర్ గా వచ్చి మీ అంతు చూస్తానంటూ కార్మికులపై బెదిరింపులకు లత దిగారని చెప్పారు.గతంలో రోజుకు ఐదు, ఆరుగురు ఎర్రబాలెం పారిశుధ్య కార్మికుల చొప్పున పది రోజులు తీసుకెళ్లి పెనుమాకలో కోళ్ల ఫారం షెడ్డు నిర్మాణం పనులు చేయించారని అన్నారు. లత పై ఎంటిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.సి ఆర్ డి ఏ లో ఉద్యోగం చేస్తూ,వేస్టేజ్ ప్రైవేట్ కంపెనీ ఏజెంట్ గా పనిచేస్తున్న నరసింహారావు కార్మికులకు సి ఆర్ డి ఏ జీతాలు చెల్లిస్తుండగా,తను ప్రైవేటుగా పనిచేస్తున్నవేస్టేజ్ కంపెనీలో పనులకు పారిశుధ్య కార్మికులను వినియోగించుకుంటున్నాడని వారు చెప్పారు. నవంబర్ 11న తుళ్లూరుకు చెందిన నలుగురు పారిశుధ్య కార్మికులను పంచాయతీ వద్ద నుంచి వేస్టేజి మార్కెటింగ్ కార్యాలయానికి తీసుకువెళ్లి,అక్కడ పనులు చేయించుకుని తిరిగి సాయంత్రం పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులతో నరసింహారావు తంబు వేయించాడని, నరసింహారావు,లత కార్మికులను తమ సొంత పనులకు ఉపయోగించు కోవడానికి సీఆర్డీఏ కమిషనర్ పర్మిషన్ ఇచ్చారా? అని రవి, భాగ్య రాజు ప్రశ్నించారు 2025 మార్చి వరకు రాజధానిలో పారిశుధ్య కార్మికులను తొలగించేది లేదని సీఆర్డీఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం చేస్తే ఆ తీర్మానానికి భిన్నంగా కమిషనర్ కార్మికులను తొలగించమని ఎలా ఆదేశాలు ఇస్తారని నిలదీశారు. ఇప్పటికైనా రాజధాని గ్రామాలలో పారిశుధ్య కార్మికులపై వేధింపులను మానుకోవాలన్నారు. ఇప్పటికైనా కోఆర్డినేటర్, కొందరు సూపర్వైజర్లు పారిశుధ్య కార్మికులపై వేధింపులు మానుకోవాలని,ఏ గ్రామంలో పనిచేస్తున్న కార్మికులను ఆ గ్రామంలోనే పని చేయించాలని డిమాండ్ చేశారు. నరసింహారావు పై త్వరలోనే సాక్ష్యాధా రాలతో సి ఆర్ డి ఏ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తామని, ఆధారాలను పత్రికలకు కూడా వెల్లడిస్తామని తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు.. వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలలగ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులకు చంద్రయాన్ -3 అనే అంశంపై వ్యాస రచన పోటీలు జరిగాయి. అలాగే చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి కందు ల ఝాన్సి లక్ష్మీ పర్యవేక్షణలో వారోత్సవాలు జరుగుతున్నాయి.

ప్రజాశక్తి-గుంటూరు



గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారో త్సవా లలో భాగంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు అయ్యంకి వెంకటరమణయ్య డాక్టర్ యస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల. హరి సర్వోత్తమరావు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. స్థానిక ఏసీ కాలేజి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయంలో జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంధాలయ ఉద్యమ నాయకుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. **తెనాలి:** స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖా గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి అధ్యక్షతన గ్రంథాలయోధ్యమ పితామహుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవి విభీమేశ్వరప్రసాద్, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఎల్ లక్ష్మణరావు, విశ్రాంత గ్రంధపాలకుడు మొవ్వ సుబ్బారావు పాల్గొన్నారు. **తాడేపల్లి:** 56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాల సందర్భంగా తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో మూడో రోజు ఉదయం పది గంటలకు సబ్ జూనియర్స్ విభాగంలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి దాదాపు 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. **దుగ్గిరాల:** గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య పాతూరి నాగభూషణం ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **కొల్లిపర:** గుత్తి బండి వారి పాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ వాడకం వలన ఉపయోగాలు, నష్టాల గురించి ,యువత డ్రగ్స్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఇదా సాంబిరెడ్డి పాల్గొన్నారు. **మంగళగిరి:** మంగళగిరి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న పలువురికి నివాళులర్పించారు. గ్రంథాలయ సంచాలకులు సిహెచ్ దీక్షితులు పాల్గొన్నారు. **పొన్నూరు రూరల్:** గ్రంధాలయోద్యమకారుల సంస్కరణ సభను బ్రాంచ్ లైబ్రేరియన్ జి కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. **పెదకాకాని రూరల్:** గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని జూనియర్స్ కు గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత అనే అంశంపై, సీనియర్స్ కు మా మాదక ద్రవ్యాల వలన కలిగే ఫలితాల అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - చేబ్రోలు



చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ముస్లిం సమాజానికి 0.15 సెంట్ల స్థలమును శ్మశాన వాటికగా కేటాయించడం జరిగిందని తహశీల్దార్ కె వి గోపాలకష్ణ తెలిపారు. శల పాడులో పూర్వకాలం నుంచి గ్రామంలో నివాసముంటున్న 50 కుటుంబాల ముస్లిం సమాజానికి మొదటి నుండి శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 27వ తేదీన చేబ్రోలు మండలంలో జరిగిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కి అర్జీ ఇవ్వడం తో ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అనుమతితో, ప్రత్యేక స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీ ప్రకారం ఇచ్చిన ఆదేశాల మేరకు చర్యలు చేపట్టి మంగళవారం గ్రామ పరిధిలోని డొంక పోరంబోకు సంబంధించిన ప్రభుత్వ స్థలములో 0.15 సెంట్లు స్మశాన వాటికకు కేటాయించటం జరిగిందని అన్నారు. ఈ సందర్భగా శలపాడు ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు.



పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-మంగళగిరి

సమాజాన్ని మార్చగలిగే శక్తి జర్నలిజానికి ఉందని పలువురు వక్తలు అన్నారు. మంగళగిరి ప్రెస్ క్లబ్ లో గురువారం జర్నలిజం... జర్నలిస్టులు అను పరిశోధనాత్మక కథనాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాన్ని సీనియర్ జర్నలిస్టు ఈ పూరి రాజారత్నం రచించారు. ఈ సందర్భంగా దాన్ని కార్యక్రమంలో శాసనమండలి ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చేది జర్నలిస్టులేనని అన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ వత్తి ధర్మాన్ని పాటిస్తూ సమాజానికి ఎంతో మేలు చేస్తున్నారని అన్నారు. ఏఎన్యూ హెచ్ ఓ డి జి అనిత మాట్లాడుతూ జర్నలిజంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. ఏ వేతనాలు లేకుండా సమాజం కోసం కషి చేసేవారు జర్నలిస్టులేనని అన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, సీనియర్ జర్నలిస్టు కే ముక్కంటి, కే రూపస్, ఏం సిరి బాబు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బి దయాకర్, వి వాసు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు.

దీక్షా పరులకు చద్ది కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

గోరంట్లలోని మెయిన్ రోడ్డులో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో దీక్షాపరులకు చద్ది కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు0. ఈ కార్యక్రమానికి వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ముఖ్య అతిథిగా దీక్షాపరులకు చద్ది వడ్డించారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, యర్రంశెట్టి సూరి, పులి శివకోటయ్య, చిల్లర శ్రీనివాస్, గుడి సతీష్‌కుమార్, తోట రంగారావు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఎ. శ్రీనివాసులు

గుండి మెడలో 'గ్రామ విత్తనోత్పత్తి'

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

వ్యవసాయ సాగులో విత్తనం యొక్క పాత్ర చాలా ప్రాముఖ్యమైందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గాయం శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఎంటిఎంసీ పరిధిలోని గుండి మెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ విత్తనోత్పత్తి కార్యక్రమం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి సహాయ వ్యవసాయ సంచాలకులు గాయం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులు మేలైన విత్తనాన్ని ఎంపిక చేసుకొని సాగు చేసినప్పుడే మంచి దిగుబడులు సాధించగలరని అన్నారు. తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ సంచాలకులు, గుంటూరు హైమావతి మాట్లాడారు. కార్య క్రమంలో గుండె మెడ వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు , చిర్రావూరి గ్రామ వ్యవసాయ అధికారిని శాంతిశ్రీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తొలి అడుగు పడింది .దాదాపు 9 ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీనస్ టాకీస్ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిఎస్పి బి. జనార్ధనరావు,టౌన్ ప్లానింగ్ ఎసిపి2 ఎల్ ఎస్ సుబ్బారావు, ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కోటేశ్వరరావును సన్మానిస్తున్న చిన్నజీయర్

కోటేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో జరుగుతున్న శ్రీ చిన్న జీయర్ స్వామి 67వ తిరు నక్షత్ర వేడుకల్లో చివరి రోజున సీతారామ చంద్రులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. 1993వ సంవత్సరంలో శ్రీ చిన్న జీయర్ స్వామి వారి శ్రీ సీతారామ చంద్రుల పెరుమాళ్లను కొంతమంది దొంగలు దొంగిలించారు. ఆనాటి కాలంలో తాడేపల్లి ఎస్ఐగా విధులు నిర్వర్తించిన కోటేశ్వరరావు పెరుమాళ్లను వెతికి తీసుకువచ్చారు. పెరుమాళ్లను అప్పగించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులకు చిన్న జీయర్ స్వామి సత్కరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కేఎల్ యు రోడ్లో విద్యుత్ లైన్లు మార్పు నిమిత్తం ఎం టి ఎం సీ పరిధిలోని కుంచనపల్లి, గుండి మెడ, మెల్లంపూడి, కొలనుకొండ, వడ్డేశ్వరం, ఇప్పటంలలో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, మంగళగిరి విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ గురువారం తెలిపారు.

నేటి ఉద్యోగుల గ్రీవెన్స్ రద్దు


ప్రజాశక్తి-గుంటూరు :ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేడు నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం అనివార్య కారణాలతో రద్దు అయినట్లు డిఆర్ఓ కె.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఉద్యోగులందరూ ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించవలసిందిగా ఆ ప్రకటనలో కోరారు.

నేడు జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశాలు నేడు ఉదయం 10 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సిఇఓ జె.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1, 2, 4, 7 స్థాయి సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరుగుతాయన్నారు. అలాగే మూడవ స్థాయి సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, ఐదో స్థాయి సంఘం పిల్లి ఉమాప్రణతి, ఆరవ స్థాయి సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరుగుతాయన్నారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలో శనివారం సాయంత్రం త్రాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉండవల్లి నుండి గుంటూరుకు త్రాగునీటి సరఫరా చేసే పైప్‌లైన్ ఫ్లోమీటర్ ఏర్పాటు పనుల వల్ల సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ఉదయం నుండి యధావిధిగా నీటిసరఫరా జరుగుతుందన్నారు. నగర ప్రజలకు మెరుగైన త్రాగునీటి సరఫరా అందించేందుకు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు.



మచ్చుకాయలను అనుమతించే ప్రసక్తే లేదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :గుంటూరు మార్కెట్ యార్డులో మచ్చుకాయలు తీసేందుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించే ప్రసక్తే లేదని యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. శుక్రవారం గుంటూరులో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్‌పాండేను ఆయన కలిశారు. మచ్చుకాయల తీయడాన్ని నిరోధించామని ఆయన కమిషనర్‌కు వివరించారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా మచ్చుకాయల పేరుతో శ్యాంపిల్స్ తీసి రైతులను నష్టపరిచే చర్యలను అంగీకరించామని ఆయన మీడియాకు తెలిపారు. యార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, గుంటూరు మిర్చి యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణాలపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న పాలవెల్లువ కార్యక్రమం క్రింద ఫిరంగిపురం, తాడికొండ, పెదకాకాని మండలాలలో కేంద్రాలకు పాలు పోస్తున్న 431 మందికి వర్కింగ్ క్యాపిటల్, దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జగనన్న పాల వెల్లువ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ క్రింద ఇప్పటికే కేంద్రాలకు పాలు పోస్తున్న 431 మందికి వర్కింగ్ క్యాపిటల్, దీర్ఘకాలిక రుణాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 2వ విడత క్రింద చేబ్రోలు, పొన్నూరు, తెనాలి, ప్రత్తిపాడు, పెదనందిపాడు, తుళ్ళూరు మండలాలకి సంబంధించి 61 గ్రామాలలో లక్ష్యంగా పెట్టుకున్న 2 వేల మందికి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.లబ్దిదారులను బ్యాంకు బ్రాంచిల వారీగా లక్ష్యాలను కేటాయించి రుణాలు అందించేదుకు చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిహరనాథ్, పశుసంవర్ధక శాఖ జె.డి.వెంకటేశ్వర్లు, కో-ఆపరేటివ్ బ్యాంక్ సి.ఈ.ఓ కష్ణవేణి, అసిస్టెంట్ రిజిస్టర్ అమరా నాగేశ్వర రావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో నిర్దేశిత లక్ష్యాల మేరకు సక్రమంగా అమలు జరిగేలా సంబంధిత శాఖల జిల్లా, మండల స్థాయి, ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, వై ఏపీ నీడ్స్ జగన్, వికసిత్ భారత్ సంకల్పయాత్ర, హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయాల సేవలు, వ్యవసాయం, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్ష నిర్వహంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సచివాలయాల్లో సంబంధిత ప్రాంతాల్లో వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిపై రూపొందించిన బోర్డుల ఆవిష్కరణ, లబ్ధిదారులకు బుక్‌లెట్‌ల పంపిణీ సక్రమంగా జరిగేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో నిర్వహించనున్న క్యాస్ట్ సర్వేపై డివిజన్, మండల స్థాయి అధికారులకు మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ కార్యక్రమాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని 258 గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాలను నవంబరు 26 నుంచి జనవరి 26 వరకు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో మోహనరావు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ గుర్రం బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంకరయ్య, బాసుదేవ్ ఆచార్యకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

సిపియం సీనియర్ నాయకులు యన్.శంకరయ్య, బాసుదేవ్ ఆచార్య మతి పార్టీకి తీరని లోటని సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. గురువారం బ్రాడీపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన శంకరయ్య, బాసుదేవ్ ఆచార్య సంస్మరణ కార్యక్రమం జరిగింది. ముందుగా వారి చిత్రపటాలకు పాశం రామారావు, వై.నేతాజిలు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ శంకరయ్య తమిళనాడు పార్టీ కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యునిగా, శాసన సభ్యునిగా దీర్ఘకాలం పనిచేశారని, జాతీయోద్యమంలో జైలు జీవితం అనుభవించారని, సిపియం నిర్మాణంలో కీలకపాత్ర పోషించారన్నారు. అదే విధంగా బాసుదేవ్ ఆచార్య 9సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయి, పేదల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తారన్నారు. బొగ్గుగని కార్మిక నాయకునిగా, రైల్వే కార్మిక నాయకునిగా వారి సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేశారు. వారి ఆశయాలని లక్ష్యాలను ముందుకు తీసుకవెళ్ళాలన్నారు. సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజి మాట్లాడుతూ అమరవీరుల స్పూర్తితో నేటి తరం మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. భారత రాజ్యాంగానికి లౌకిక విలువలకు ప్రమాదం ఏర్పడిన పరిస్థితిల్లో ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, నాయకులు బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాస్, ఎమ్.కిరణ్, ఖాశిం షహీద్, వై.కష్ణకాంత్ తదితరలు పాల్గొన్నారు.



శంకరయ్య, బాసుదేవ్ ఆచార్య చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిపియం నాయకులు



మాణిక్యరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘ నాయకులు

నిస్వార్థ సేవకుడు ఎంజె మాణిక్యరావు

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాల పాటు విద్యాబివృద్ధికి కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి లక్షలాది మంది జీవితాలలో వెలుగులు నింపిన పోరాట యోధుడు ఎం.జె.మాణిక్యరావు అని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యమ నేత మాజీ ఎమ్మెల్సీ మాణిక్యరావు 15వ వర్ధంతి సందర్బంగా స్థానిక ఆంధ్ర క్రైస్తవ కళాశాల కూడలి వద్ద ఉన్న మాణిక్యరావు విగ్రహానికి కెఎస్ లక్ష్మణరావు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో యూజీసీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మంచాల బోసు బాబు, ఏసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజస్, జూనియర్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షేక్.అయాజుద్దీన్, పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గురువారం గుంటూరులోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు స్థానిక జిటి రోడ్డులోని యూనియన్ బ్యాంకు రీజీయనల్ ఆఫీసు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘం సెక్రెటరీ సయ్యద్ బాషా అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో ఆయన మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిపివేశారని అన్నారు. ఒక ప్రక్క ఉద్యోగ విరమణలు, మరణాలు, మరొక ప్రక్క వ్యాపారం పెరుగుతుందన్నారు. కానీ అందుకు తగినట్లుగా నియామకాలు చేపట్టట్లేదన్నారు. అందువల్ల ఉద్యోగులపై పనిభారం విపరీతంగా పెరిగి, మానసకి ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. కొన్ని సందర్భాల్లో బలవన్మరణాలు కూడా జరుగుతున్నాయన్నారు. ఈ నెలలోనే యూనియన్ బ్యాంకు కోదాడలో ఒక ఉద్యోగి, కర్ణాటక బ్యాంకులో మరో ఉద్యోగి ఒక అధికారికి లేఖ కూడా రాసి ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు.ప్రభుత్వం తక్షణమే నియామకాలు చేపట్టాలని, లేని ఎడల రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేబడతామని హెచ్చరించారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలు నిలిపివేసి శాశ్వత ఉద్యోగ నియామకాలు జరపాలి.కార్యక్రమంలో కెనరా బ్యాంకు రవి, పిఎన్‌బి నుండి మురళి, బిఒబి నుండి షరీఫ్, యుబిఐ నుండి వేణు, ఇండియన్ బ్యాంకు నుండి రామకృష్ణ, డికె కుమార్, పావని, విజయక్రాంతి, పి. కిషోర్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు.



డిసెంబర్ 19 నుండి కెఎల్‌యులో అంతర్జాతీయ సదస్సు

కెఎల్‌యుని సందర్శించిన వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయ విసి డాక్టర్ బాబి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కె ఎల్ డీమ్డ్ యూనివర్శిటీ వడ్డేశ్వరం గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్ ను విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డిశంబర్ నెల19 నుండి 21 వరకు కెఎల్‌యులో నిర్వహించనున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు సమీక్షా సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి అంతర్జాతీయ సదస్సులు అవసరమని అన్నారు. కెఎల్ యూనివర్శిటీలో ఉన్న వ్యవసాయం, బయో టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మసీ, రసాయనిక శాస్త్రం వంటి ముఖ్య మైన ఐదు విభాగాలు కలిసి నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో వైద్య శాస్త్రంలో జరగాల్సిన పలు పరిశోధనల గురించి చర్చ జరగాలని కోరారు. దేశంలో ఉన్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 32 దేశాల నుండి ఆయా విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో వర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, వ్యవసాయ విభాగ డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్, లైఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బుచ్చి నాయుడు, ఆయా విభాగాధిపతులు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.